తేదీ 1.1.2008 శ్రీ సత్యసాయి యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సమావేశం, సాయికుల్వంత్

# "సత్యమేవ జయతే"

**దినకరుడు శాంతుడై తోచె, దినములింక కురుచలయ్యె, చలిగాలి చురుకు హెచ్చె**
**పొలములన్ రేడి గ్రుడ్డి వెన్నెలలోన కుప్పలన్ నూర్చు కాపులు గొంతులెత్తి**
**పదములన్ పాడదొడగిరి, పచ్చపూవుల జనపచేలకు ముత్యాలసరులు కూర్చి**
**మిరపపండ్లకు కుంకుమ మెరుపు రాల్చి బంతిపూవుల మొగములల్లంత విప్పి**
**మన గృహంబుల ధాన్య సంపదలు నిల్పి సరసురాలైన పుష్యమాసంబు వచ్చె!**

మానవునకు అన్ని వస్తువులూ అవసరమే! కాని, ఈ ప్రపంచములో ఏదియును శాశ్వతము కాదు. అన్నీ కదలిపోయే మేఘములే! దేనిని మనము స్థిరమని అనుకుంటున్నామో అది అస్థిరమైపోతుంది. శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైనటువంటిదానిని పట్టవలెనన్న మనకు ఒకే ఒక మార్గమున్నది. "మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః", 'ఈ జగత్తులో అందరుకూడను నా అంశములే, అందరియందు నేనున్నాను' అని భగవద్గీత మానవాళికి బోధిస్తున్నది. I am in you, with you, around you, above you and below you. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించాలి. "ఈశ్వర స్సర్వభూతానాం", "ఈశావాస్య మిదం జగత్". భగవంతుడు లేనటువంటి స్థానముగాని, భగవంతునిది కానటువంటి రూపముగాని జగత్తులో ఎక్కడా కనపడవు. కాని, మానవుడు ఈ సత్యాన్ని గుర్తించుకొనలేక, "ఎక్కడ చూసినా నాకు మానవులే కనిపిస్తున్నారే! దేవుడు కనిపించడం లేదే!" అని భావిస్తున్నాడు. "యద్భావం తద్భవతి". నీవు అద్దం ముందు ఏ డ్రస్సు వేసుకొని నిలబడితే ఆ డ్రస్సే ఆ అద్దములో నీకు కనిపిస్తుంది. అదేవిధముగనే, నీయొక్క భావములు, నీయొక్క తలంపులే జగత్తనే అద్దములో ప్రతిబింబిస్తుంటాయి. అవి మంచివిగాని, చెడ్డవిగాని వాటి 'రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్'లు నీకే తిరిగి వస్తాయి. నీనుండి వచ్చే 'సౌండే' నీకు 'రీసౌండ్'గా తిరిగి వస్తుంది. నీవు ఏ

srisathyasai vacharamrutam

మాటలు పలుకుతున్నావో అవే మాటలు తిరిగి నీకు 'రిప్లై'గా వచ్చేస్తాయి. "వాడు మాట్లాడుతున్నాడు, వీడు చెబుతున్నాడు" అని మనము అనుకుంటాము. కాని వాడు, వీడు అనే భేదము లేదు; అందరూ ఒక్కటే! మనము చూచేటటువంటివన్నీ మన రిఫ్లెక్షన్‌లే! నీవు చూచే ప్రతి రూపముకూడను నీ ప్రతిబింబమే! నీకు ఏ రోగము వచ్చినప్పటికీ అది నీయొక్క రియాక్షనే! నీవు అనుభవించేవన్నికూడను నీయొక్క రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్‌లే!

**'ఎడ్యుకేషన్' - 'ఎడ్యుకేర్'**

ఇక్కడ ఇన్ని వేలమంది చేరారు. కాని, అందరి హృదయమునందు ఉన్నది ఒక్కటే! హృదయమంటే 'ఫిజికల్ హార్టు' (గుండె) కాదు; 'స్పిరిచువల్ హార్టు'. కాని, ఈ 'స్పిరిచువల్ హార్టు'ను ఈనాడు చాలామంది నమ్మలేకపోతున్నారు. ఈనాడు మీరు అనేక చదువులు చదువుతున్నారు.

**చదువులన్నియు చదివి చాల వివేకియై / మదిని తన్నెఱుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతినున్నను / హీనుడవగుణంబు మానలేడు**
**తరచి చదువు చదువ తర్కవాదమెగాని / పూర్ణజ్ఞానంబెపుడు పొందలేడు**
**చదువులన్నియు చదివి చావంగనేటికి?! / చావు లేని చదువు చదువవలయు**

ఈ చదువులు కాదు మనము చదువవలసినది. ఇవన్నీ భౌతికమైన చదువులు (ఎడ్యుకేషన్). ఇవి అధ్యాపకులనుండి నేర్చుకునేవి. మనము చదివే చదువులుగాని, మాట్లాడే మాటలుగాని, చెప్పే ఉపన్యాసాలుగాని కేవలం బాహ్యమైనవి, లౌకికమైనవి. అన్నింటికినీ ఆధారమైనది మనలోపల ఒకటున్నది. దానికి సంబంధించినదే 'ఎడ్యుకేర్'. అది మనకు కనిపించేది కాదు. 'ఎడ్యుకేర్' అనే పదమునకు 'లోపలినుండి వెలికి తీయడము' అని అర్థము. సత్యము ఎక్కడున్నది? మన హృదయములోనే ఉన్నది. దానిని ప్రయత్నపూర్వకంగా సాధించాలి. అదే 'ఎడ్యుకేర్'. 'పీస్' (శాంతి) ఎక్కడున్నది? బయట ఉన్నదా? లేదు, లేదు. ఒకరితో ఒకరు పోట్లాడటంవల్ల బయట అనేకరకములైన అల్లర్లు జరుగుతున్నాయి. బయట అంతా Pieces, Pieces! Peace (శాంతి) మనలోనే ఉన్నది. అట్లే, ప్రేమ అనేది మనకు కనిపించేదికాదు. అదికూడా మన హృదయమునందే ఉన్నది.



srisathyasaivachanamrutam

'ప్రేమయే దైవం. ప్రేమలో జీవించాలి'. ఇదే 'ఎడ్యుకేర్'. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస – ఇవే మన పంచ ప్రాణములు. హృదయంలో ప్రేమను పెట్టుకొని మీరు సత్యము ననుసరించండి. సత్యము శాశ్వతమైనది. సత్యమే దైవం. ఎక్కడికి పోయినప్పటికీ, ఏ కాల మైనప్పటికీ, ఏ దేశమైనప్పటికీ సత్యము మారేటటువంటిది కాదు. కనుక, సత్యమును అనుసరిస్తూ మీ హృదయంలో ప్రేమను ప్రకాశింపజేసుకోండి.

**ఎవరిని ద్వేషించినా నిన్ను నీవు ద్వేషించుకున్నట్లే!**

నీవు ఒక వ్యక్తిని చూసినప్పుడు ప్రాపంచిక దృష్టిలో 'అతను నా ద్వేషి' అనుకుంటావు. కాదు, కాదు. అతనుకూడా నీవే! కనుక, నీవతనిని ద్వేషిస్తే నిన్ను నీవే ద్వేషించుకుంటున్నావు; అతనిని కొడితే నిన్ను నీవే కొట్టుకుంటున్నావు. ఈ ప్రపంచములో ఉన్నది ఒక్కటే! రెండవది లేనే లేదు. ఈ సత్యాన్ని మనం మొట్టమొదట గుర్తించి అనుసరించాలి. ఈనాటి ప్రపంచమునందు సత్యమనేది ఎక్కడా కనిపించడం లేదు. విద్యార్థులయందుగాని, రాజకీయమునందుగాని సత్యము అసలు కనిపించడమే లేదు. అందువల్లనే అందరూ కోర్టులకు పోతున్నారు. కాని, అక్కడకూడను తిరిగి అసత్యమే చెబుతున్నారు; అసత్యముకోసం ఎంతో ధనము ఖర్చుపెడుతున్నారు. అయితే, జయము మాత్రము సత్యమునకే! సత్యమునకు ఏదీ ఖర్చుపెట్టనక్కర్లేదు. ప్రేమ ఒక్కటి మాత్రమే చాలు. నీ ద్వేషి నీకు ఎదురు వస్తే "నమస్కారమండీ!" అను. అతనుకూడా నీకు నమస్కారమంటాడు. నీ భావము ఎట్టిదో ఎదుటివానిలోకూడా అట్టి భావమే ప్రతిబింబిస్తుంది.

**ప్రేమ తప్ప మరి ఏ ఒక్కటీ మనల్ని రక్షించలేదు**

ప్రపంచములో ఈనాడు ఎక్కడ చూసినా శాంతి అనేదే కనిపించడం లేదు. నలుగురు వ్యక్తులు చేరితే అక్కడ ఒక గలాటా! మార్కెట్‌లో గలాటా! బజార్లో గలాటా! షాపుకు పోతే గలాటా! హోటల్‌కు పోతే "ఈ ఇడ్లీ సరిలేదు, ఆ దోసె సరిలేదు, ఈ వడ సరిలేదు" అని అక్కడకూడా గలాటా! అంతా సరిలేదు, సరిలేదు, సరిలేదు! జగడము లేనటువంటి స్థానము ఎక్కడా కనిపించడం లేదు. శాంతి అనే పదమును వినటానికి కూడా మనకు వీల్లేకుండా

srisathyasaivachanamrutam

ఉన్నది. కాని, ఇక్కడ చూడండి, ఈ హాలులో ఎంతో ప్రశాంతంగా ఉన్నది. ఈ శాంతి, ఈ ప్రేమ మరెక్కడకూడను కనిపించవు.

అసలు మీరు భగవంతుని దగ్గరకు పోయి ప్రార్థించడం దేనికోసం? శాంతికోసమని, ఆనందము కోసమని, ప్రేమకోసమని మనము ప్రార్థించాలి. పుట్టపర్తిలో, బృందావనంలో చదివిన మా పిల్లలు దేశమంతా చుట్టారు; విదేశాలకుకూడా వెళ్ళారు. కాని, ఎక్కడికి పోయినా వారికి ఒక్క క్షణమైనా 'పీస్ ఆఫ్ మైండ్' (మనశ్శాంతి) లేదు. మీరు శాంతికోసం బయట వెతికితే ప్రయోజనం లేదు. శాంతి మీయందే ఉన్నది. సత్యము, ప్రేమ రెండుకూడను మీయందే ఉన్నవి. ప్రేమ ఒక్కటి ఉంటే మనము సర్వమును సాధించవచ్చును. ప్రేమయే స్వామికి ఉన్న పెద్ద ప్రోపర్టీ! ఈ ప్రేమను అందరికీ అందించడమే నా కర్తవ్యము. ఈ ప్రేమకు సరియైన అర్థము తీసికొని, దీనిని సక్రమమైన మార్గంలో వినియోగించుకుంటే మీరు ఎంతో బాగుపడతారు. ప్రేమ తప్ప మరి ఏ ఒక్కటీ మనల్ని రక్షించలేదు. కనుక, ఈ ప్రేమతత్త్వాన్ని అందరుకూడను తెలుసుకోవాలి. అందరూ సిస్టర్స్ అండ్ బ్రదర్సే! కాని, ఈనాడు బ్రదర్స్ అండ్ సిస్టర్స్‌లో కూడను భేదములు ఏర్పడుతున్నాయి. కనుక, మనం ప్రధానంగా నేర్చుకోవలసినది ప్రేమతత్త్వము. అప్పుడే మన జీవితం ఉన్నతమైన, ఆదర్శవంతమైన జీవితంగా తయారవుతుంది. ఎప్పుడు చూసినా మీరు ఆనందంగా ఉండాలి; నవ్వుతూ, నవ్వుతూ ఉండాలి; 'కేస్ట్రాయిల్ ఫేస్' (ఆముదపు మొహం) పెట్టకూడదు. ఎందుకంటే, మనకేమి తక్కువ! అన్నీ మనలోనే ఉన్నాయి. కాని, కొంతమంది కష్టములు వచ్చినప్పుడు భరించుకోలేరు. ఐతే, కొంచెం ఓపిక పట్టుకుంటే తప్పక ఆ కష్టములు కూడను ఆనందాన్ని అందిస్తాయి. Pleasure is an interval between two pains.

మీరు అనేక పుస్తకాలు చదువుతున్నారు. కాని, ఎన్ని పుస్తకాలు చదివినప్పటికీ మీ మస్తకమే సరిలేకపోతే అంతా నిరర్థకమే! మస్తకము చాలా ప్రధానమైనది. మస్తకమును పవిత్రం గావించునదే 'ఎడ్యుకేర్'. ఒక్కొక్క పర్యాయము మీ మనస్సే మీకు విరుద్ధంగా మారుతుంటుంది. మీయొక్క భావమే ఆవిధమైన మార్పు తెప్పిస్తుంది. "రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్" ... ఈ మూడింటికీ కారణం మీ మనస్సే! ప్రతి ఒక్కటికూడను మంచిగాని,

sri sathyasai vacharamrutam

చెడ్డగాని మనలోనే ఉన్నాయి; బయటి ప్రపంచములో ఎక్కడా ఏమీ లేదు. నీ దృష్టి చెడ్డగా ఉన్నప్పుడు చెడును చూస్తావు. నీ మనస్సు మంచిగా ఉన్నప్పుడు అంతా మంచిగానే కనిపిస్తుంది. సత్యము, ప్రేమ - ఈ రెండింటినీ వదలిపెట్టి మనము దేనియందు ప్రవేశించినా అక్కడ అన్నీ భేదాలే కనిపిస్తుంటాయి.

**ఆత్మతృప్తి కావాలంటే అంతా ఒక్కటే అని భావించాలి**

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! మీరు ఇక్కడ చదువుకొని ఎంతో దూరం పోయి, ఎన్నో దేశాలు తిరిగి, ఇప్పుడు ఇక్కడికి వచ్చి ఈవిధంగా స్వామిని తలుచుకుంటున్నారంటే, ఇది నిజంగా మీ అదృష్టమే! దీనికంతటికీ ప్రేమ ఒక్కటే కారణం. లేకపోతే, మీరు ఇంత ఖర్చులు పెట్టుకొని, ఇన్ని శ్రమలకోర్చి మీమీ కుటుంబాలతో ఇక్కడికి రావటానికి వీలవుతుందా? ఇది ఎంత అదృష్టము! ఈ సత్యాన్ని మీరు గుర్తించి వర్తించాలి. మీరు బృందావనంలో చదివారు, ప్రశాంతి నిలయంలో చదివారు. మీరు ఎక్కడికైనా వెళ్లినప్పుడు "ఎక్కడినుండి వచ్చారు?" అని ఎవరైనా మిమ్మల్ని అడిగితే "మేము ప్రశాంతి నిలయంనుండి వచ్చాము", "మేము బృందావనంనుండి వచ్చాము" అని మీరు చెబుతారు. అయితే, అది కేవలం మీ తృప్తికోసం మీరు చెప్పుకోవడమేకాని, నిజానికి ప్రశాంతి నిలయం మీలోనే ఉంది; బృందావనం మీలోనే ఉంది. అన్నీ మీయందే ఉంటున్నవి. ఆత్మతృప్తి కావాలంటే అంతా ఒక్కటే అని భావించాలి.

**మతములన్నియు వేరు, మార్గంబు ఒక్కటే**
**వస్త్ర భేదము వేరు, వస్తువొకటే**
**శృంగారములు వేరు, బంగారమొక్కటే**

చెవులకు పెట్టుకునేవాటిని 'కమ్మల'న్నారు, చేతులకు వేసుకునేవాటిని 'గాజుల'న్నారు, మెడలో వేసుకునే దానిని 'చైన్' అన్నారు. కాని, బంగారం ఒక్కటే కదా! అట్లే, "పశుల వన్నెలు వేరు, పాలు ఒకటే." ఒక ఆవు తెలుపు కావచ్చు, మరొక ఆవు నలుపు కావచ్చు. కాని, పాలు మాత్రం తెలుపే! అదేవిధముగనే మనుష్యులందరూ వేరువేరుగా ఉన్నప్పటికీ హృదయములో అనుభవించే ఆనందము ఒక్కటే! అట్టి ఆనందాన్ని మనము ఆశించాలిగాని, వ్యక్తిగతమైన భేదాలను ఏమాత్రం పెట్టుకోకూడదు. ఈ భేదాలు తాత్కాలికంగా వచ్చిపోయే

టటువంటివి. ఇవన్నీ మన మనస్సుయొక్క 'రియాక్షన్, రిఫ్లెక్షన్, రీసౌండ్'లే!

**ఎవరిని చూసినా దైవంగా భావించాలి**

ఉన్నది ఒక్కటే! ఆ దివ్యత్వమే కృతయుగములో వామనమూర్తిగాను, త్రేతాయుగంలో రామునిగాను, ద్వాపరయుగంలో కృష్ణునిగాను అవతరించింది. కాబట్టి ముగ్గురూ ఒక్కటే. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ ఒక్కటే. ఈ పేర్లన్నీ కేవలం రూపమునుబట్టి గుర్తుకోసం పెట్టుకున్నాము. కాని, అందరిలో ఉండేది ఒక్కటే, అదే 'ఐ' (నేను). 'నీ పేరేమిటి?' అని నిన్ను అడిగితే ఏదో ఒక పేరు చెబుతావు. ఆ పేరు నీ తల్లిదండ్రులు వాళ్ల గుర్తుకోసం పెట్టుకున్నదేగాని నీవు పెట్టుకొని రాలేదు. పేర్లు మధ్యలో పెట్టినటువంటివి. ఇవి పెట్టినవేగాని పుట్టినవి కావు. ఈ పేర్లను ఆధారం చేసికొని అనవసరంగా దైవాన్నికూడా భేదదృష్టితో వేరువేరు రూపములుగా నీవు చూస్తున్నావు. అసలు ఎవరిని చూసినా దైవంగా భావించాలి. నీవు బజార్లో వెళుతుంటే ఒక బెగ్గరు ఎదురుగా వచ్చాడనుకో. అతనుకూడా దైవమే! భగవంతుడే ఆ రూపములో ఉన్నాడు. కనుక, అతనికికూడా నమస్కారం చేయి, తప్పు లేదు. అందరికీ అనంతకోటి నమస్కారములు అర్పించు. అందరూ ఒక్కటే. అందరినీ సమదృష్టితో చూడాలి. బీదవాడుగాని, షావుకారుగాని అందరినీ మనము ప్రేమించాలి.

**మంచిచెడ్డలను సమంగా చూసుకోవాలి**

ఈ సంవత్సరంలో భౌతికంగా చాలా మార్పులు కలుగుతాయి. కాని, ఆధ్యాత్మికంగా ఎప్పటికీ మార్పురాదు. లౌకికంగా కొన్ని ద్వేషములు వస్తుంటాయి, కొన్ని కలహములు వస్తుంటాయి, అనేకరకములైన పార్టీలు వస్తుంటాయి. పార్టీ, పార్టీ – ఫర్ టీ! అయితే, మనము విభేదాలను విడనాడి అంతా ఒకటిగానే చూసుకోవాలి. దానివల్లనే మనకు సుఖం చిక్కుతుంది. కష్టమొచ్చినా, దుఃఖమొచ్చినా అది తాత్కాలికమే! తప్పక మంచి జరుగుతుంది. మన కష్టములన్నీ మనకు సుఖమునిచ్చేకోసమనే వస్తున్నాయి. రెండు బాధల మధ్యలోనే ఒక సుఖము వస్తుంది. కనుకనే, ప్రతిదానికి మంచిచెడ్డలు రెండూ ఉండాలి. ఆ రెండింటినీ సమత్వముగా చూసుకోవడమే మానవుని యొక్క ప్రధాన కర్తవ్యము.

sri sathyasai vahini amrutam

**'యూనిటీ' - 'ప్యూరిటీ' - 'డివినిటీ'**

మనస్సు ఆహార విహారములచే అనేకరకములుగా మార్పుచెందుతుంటుంది. Mind is like a mad monkey (మనసు ఒక పిచ్చికోతివంటిది) మామూలు కోతి కాదు, పిచ్చికోతి! అసలు మనస్సు 'మేన్‌కైండ్' (మానవజాతి)కి సంబంధించినది. కాబట్టి, అది 'కైండ్‌నెస్' (దయ)తో నిండి ఉండాలి. కాని, దానిని మనం 'మంకీ-మైండ్'గా మార్చుకుంటున్నాము. మనిషి మనిషిగా జీవించాలి. మనకు తెలియకుండా ఎవరైనా కీడు చేసినప్పటికీ, మనము ఎవ్వరికీ కీడు చేయకూడదు. వాడు చేసుకుంటే చేసుకోనీగాని మనం వానికి కీడు సల్పకూడదు. నా సందేశమిదియే! ఇప్పుడు ఈ దేహానికి 82 సం॥లు. ఇంతవరకు నేను ఒక్క క్షణమైనా ఎవ్వరినీ ఏమాత్రం బాధపెట్టలేదు; ఎవ్వరికీ కీడు చేయలేదు; ఎవ్వరికీ అపకారం చేయలేదు; ఎవ్వరికీ అన్యాయం చేయలేదు; అసత్యమాడలేదు. ఎప్పుడూ సత్యమే, సత్యమే, సత్యమే! అసత్యం చెప్పాలంటే చాలా కష్టపడవలసివస్తుంది. కనుక, మీరెప్పుడూ సత్యమార్గంలో నడవండి; తప్పక మీకు జయము కలుగుతుంది. అందరినీ ప్రేమతో చూడండి. 'అది మా చేతకాదు' అని మీరంటారు. కాని అదే చాలా సులభమైన మార్గము. ప్రేమించడం చాలా సులభం. ద్వేషించడమే చాలా కష్టం. మనం అందరినీ ప్రేమిస్తే అన్నివిధాలుగా సమత్వము ఏర్పడుతుంది. అప్పుడే అందరూ ఏకమైపోతారు. 'యూనిటీ' (ఏకత్వం) ఉండినప్పుడే 'ప్యూరిటీ' (పవిత్రత) వస్తుంది. 'ప్యూరిటీ' ఉన్నప్పుడే 'డివినిటీ' (దివ్యత్వం) ఆవిర్భవిస్తుంది. కనుక, 'డివినిటీ' కావాలంటే 'యూనిటీ' కావాలి. 'యూనిటీ' కావాలంటే మన సంకుచితమైన వ్యక్తిత్వాన్ని మరచిపోయి అందరూ ఏకం కావాలి. మానవత్వం క్రమక్రమేణ దైవత్వంగా మారాలి. మీ అందరికికూడను ఆ 'డివైన్ పవర్' (దివ్యశక్తి) ఉంది. 'డివైన్ పవర్' లేని మానవుడే లేడు. కాని, దానిగురించి మీరు యోచించడం లేదు. మీ మనసంతా మానవత్వంపైననే పోతున్నది. మనసు మానవత్వంపై పోకూడదు; ఎటువంటి పరిస్థితి యందైనను దైవంపైననే ఉండాలి.

**సంబంధ బాంధవ్యాలన్నీ మీరు కల్పించుకున్నవే!**

కొందరు నన్ను అడుగుతుంటారు, "స్వామీ, 'యూనిటీ' ఎట్లా సాధ్యమవుతుంది?" అని.

sri sathyasaivachanamrutam

‘యూనిటీ’ అనేది మనయొక్క స్వభావమే! ‘నేను వేరు, ఇతను వేరు, అతను వేరు’ అని అనుకుంటున్నకొద్దీ మనకు ‘డివినిటీ’ దూరమవుతుంది. నీవు, అతను, ఇతను అందరూ కలిసి ఒకటే అనుకో! ‘ఈయన నా ఫాదర్, ఈమె నా మదర్, ఈమె నా సిస్టర్’ అంటావు. ఈ సంబంధ బాంధవ్యాలన్నీ కేవలం భౌతిక స్థాయిలో ఏర్పడినవేగాని నిజంగా ఎవరూ నీకు ఫాదర్ కాదు, మదర్ కాదు, సిస్టర్ కాదు. వివాహం చేసుకోవడంవల్ల ‘భార్యాభర్తలు’ అని అంటున్నారుగాని, లేకపోతే భార్య ఎవరు? భర్త ఎవరు? ఇవన్నీ మీకై మీరు కల్పించుకున్నవే! అయితే, ఆ సంబంధము ఉన్నంత వరకు దానిని అనుసరించి మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించాలి. అందులోకూడను ఎవ్వరినీ బాధ పెట్టకూడదు. భార్య కదా అని ఆమెను కొట్టకూడదు, తిట్టకూడదు. ఏదైనా తప్పు జరిగినప్పుడు “ఫలానా తప్పు నీలో ఉంది” అని చెప్పవచ్చును. అంతేగాని, వాళ్లని తిట్టడం, కొట్టడం రాక్షసత్వమే!

**సత్యము, ప్రేమ - ఈ రెండింటినీ మీ రెండు నేత్రాలుగా భావించండి**

పిల్లల్లారా! మీరెంతో ప్రేమతో వచ్చారు. మీ హృదయాలను ప్రేమతో నింపుకోండి. ఏవిషయము వచ్చినప్పటికీ సత్యాన్నే చెప్పండి. సత్యము చెబుతూ వస్తుంటే మనకు కొన్ని అడ్డంకులు వస్తుంటాయి. ఎన్ని వచ్చినా ఫరవాలేదు, మీ తల పోయినా ఫరవాలేదు, సత్యాన్నే చెప్పండి. అప్పుడే మనకు జయము కలుగుతుంది. ఒక చిన్న విషయము: ఒక పర్యాయం బెంగళూరులో ఒకామె ‘గోల్డ్ చైన్’ను ఒక దొంగ ఎత్తుకొని పోయాడు. తరువాత ఆ దొంగ చిక్కినాడు. పోలీసు ఆ గొలుసును ఆమెకు చూపించి, “ఇది నీదేనా అమ్మా” అని అడిగాడు. ఆమె, “నాదే” అన్నది. “దీనికి ఎన్ని రింగులున్నాయి?” అని అడిగాడు. “అయ్యో, నేను రింగులు ఎంచుకోలేదు నాయనా!” అన్నది. “నీవు ప్రతి రోజు మెడలో వేసుకునే గొలుసుకి ఎన్ని రింగులున్నాయో తెలియదా? అయితే ఇది నీది కాదు” అన్నాడు. అప్పుడామె, “అయ్యా, ప్రతిరోజు నీవు గడ్డం గీసుకుంటున్నావు కదా! మరి నీ గడ్డంలో ఎన్ని వెంట్రుకలున్నాయో చెప్పగలవా?” అని అడిగింది. “అట్లనే నేను ప్రతి రోజు ఈ చైన్‌ను మెడలో వేసుకుంటున్నాను. కాని, ఎన్ని రింగులో చూడలేదు” అన్నది. ఆమె భయపడలేదు, సత్యమే చెప్పింది. కాబట్టి, ఆ గొలుసును ఆమెకిచ్చేశాడు. కనుక, సత్యానికి మనం

sri sathyasai vachanamrutam

భయపడకూడదు. సత్యం కోసం 'ఫైట్' చేయాలి. ఆ సత్యమే నిలుస్తుంది. ఆ సత్యమే మనకు విజయాన్ని అందిస్తుంది. "సత్యమేవ జయతే." కనుక, మీరు సత్యాన్ని చెబుతూ రండి. సత్యమార్గములో పయనించండి. ప్రేమమార్గములో పయనించండి. ప్రేమే సత్యము, సత్యమే ప్రేమ. ఈ రెండింటినీ మీ రెండు నేత్రాలుగా భావిస్తే అన్నింటియందు మీరు విజయాన్ని సాధిస్తారు. ఈ రెండూ లేకుండా మీరు 'భక్తి, భక్తి, భక్తి' అని భగవంతుని ఊరకే కొలిస్తే ప్రయోజనం లేదు.

**మంచిపేరు తెచ్చుకోండి, బంగారూ!**

మీకు మంచి తెలివితేటలు ఉండవచ్చు, 'నాలెడ్జి' ఉండవచ్చును. కాని, విచక్షణా జ్ఞానం లేకుండాపోతే అంతా 'జీరో' అయిపోతుంది. కనుక, విచక్షణా జ్ఞానం చాలా అవసరము. ఏ పనైనా చేయడానికి ముందు 'ఈజ్ ఇట్ రైట్ ఆర్ రాంగ్?' (ఇది తప్పా? ఒప్పా?) అని చూసుకోండి. మీ అంతరాత్మకు 'ఇది రైట్' అనిపిస్తే తప్పక దానికోసం మీరు 'ఫైట్' చేయండి. ఇప్పుడు లోకమంతా స్వార్థ స్వప్రయోజనములతో నిండి ఉంది. స్వార్థ స్వప్రయోజనములకు ఎప్పుడూ అపజయమే! మీరు సత్యమార్గమును, ప్రేమమార్గమును అనుసరించి అన్నింటియందు విజయాన్ని పొందండి. సత్యసాయి కాలేజి స్టూడెంట్స్ అందరు కూడను ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలి. 'ఫలాని సత్యసాయి స్టూడెంట్ మంచివాడు' అని మీరు పేరు తెచ్చుకుంటే, నాకదే ఆనందము. నాకంతకంటే మీరు ఇవ్వవలసింది ఏమీ లేదు. మీరందరూ మంచిపేరు తెచ్చుకోండి. అదే మీరు నాకివ్వవలసినటువంటి పెద్ద బహుమతి. అయితే, నాకోసం కాదు; మీకోసం మీరు మంచిపేరు తెచ్చుకోండి బంగారూ! మీరందరూ ఐకమత్యముతో ఉండి, దైవచింతన చేస్తూ ఉంటే మీలో పవిత్రత ఏర్పడుతుంది. అప్పుడు తప్పక స్వామి మీరున్నచోటికే వచ్చి దర్శనమిస్తాడు. నేను మీవాడిని. మీరందరూ నావారలే! నాకెవరిపట్లకూడను భేద భావము లేదు. భేదభావము చాలా చెడ్డది. ఏదో ప్రాపంచికంగా కొన్నికొన్ని విషయాలలో 'నీది, నాది' అంటాము. అంతేగాని మనలోపల భేదములు ఏమాత్రము ఉండకూడదు. ఎక్కడ ఉండినప్పటికినీ భగవన్నామాన్ని మనస్సులో మరువకండి. రామా, కృష్ణా, జీసస్, అల్లా...

sri sathyasaivachanamrutam

ఏ పేరైనా స్మరించండి. పేర్లు వేరైనప్పటికీ భగవంతుడు ఒక్కడే. "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్ర పాద్." కనుక, భగవంతుణ్ణి మీ హృదయంలో పెట్టుకొని సత్యాన్ని అనుసరించండి. సత్యము, ప్రేమ – ఈ రెండింటినీ మీరు భద్రంగా పెట్టుకోండి. *(భగవాన్ "హరి భజన బినా సుఖ శాంతి నహీ..." అనే పాట పాడిన తరువాత తమ దివ్యోపన్యాసాన్ని కొనసాగిస్తూ ఇలా అన్నారు)*

భజనలో ఉన్నటువంటి ఆనందము ఇంక దేనియందుకూడా ఉండదు. అందువల్లనే, భజనలు చేయడం చాలా అవసరము. ఒకరు విన్నా, వినక పోయినా మన ఆనందము మనదే! 'ఫాలో' చేసేవారు లేకపోయినా మనకు మనమే 'ఫాలో' చేసుకుందాము. చాలా సంతోషము. *(స్వామి పూర్వ విద్యార్థుల నుద్దేశించి 'మీరంతా ఎప్పుడు పోవాలి?' అని అడిగారు)* ఎక్కడికైనా వెళ్లండి. స్వామి దయ దండిగా ఉంది. రేపు అందరికీ ప్రసాదము ఇస్తాను. ఆనందంగా మీరు తిరిగి వెళ్లండి.

**తేదీ 1.1.2008 శ్రీ సత్యసాయి యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సమావేశం, సాయికుల్వంత్**

sri sathyasai vachanamrutam